క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం పర్యటించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్లు కేటీ హరిశ్చంద్రా రెడ్డి, అపరంజిరాజు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పిచ్చాటూరు ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో, 11 గంటలకు నాగలాపురం మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళమిస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి మంగళవారం పట్టణానికి చెందిన డాక్టర్ దుర్వాసుల శెట్టి, లీలావతి రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఈఓ సాగర్‌బాబుకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వారిని గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక తెలుగుగంగ కార్యాలయం వద్ద ఉన్న లైబ్రరీలో మంగళవారం స్వచ్ఛత రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు మావుడూరు మోహన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర నేత్రాలయ హాస్పిటల్ మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ వైద్య బృందంముని, రామలింగారెడ్డి ఈ శిబిరంలో 64 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 32 మందికి చెన్నైలోని తమ ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తామని శంకర నేత్రాలయ వైద్యులు తెలిపారు. ప్రతినెలా 4వ మంగళవారం స్థానికంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని, దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కో–ఆర్డినేటర్ గౌరి, వలంటీర్ కాంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఆ సర్టిఫికెట్లతో నాకు సంబంధం లేదు’

రేణిగుంట: గతంలో రేణిగుంట తహసీల్దార్‌గా పని చేసే సమయంలో అప్పటి జిల్లా కలెక్టర్, మాజీ మంత్రి ఆదేశాలతో మండలంలోని పలు గ్రామాల్లో అనుభవ పట్టాలను ఇచ్చానని, అయితే ప్రస్తుతం తాను పాత తేదీలతో పట్టాలు ఇస్తున్నట్లు వదంతులు సృష్టిస్తున్నారని విశ్రాంత తహసీల్దార్ నరసింహులు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అప్పట్లో ఇళ్లు కట్టుకుని ఎలాంటి పట్టాలు లేకుండా అనుభవిస్తున్న నిరుపేదలకు కరెంటు కనెక్షన్ నిమిత్తం తాను అనుభవ పట్టాలు జారీ చేశానని స్పష్టం చేశారు. వాటిపై ఏవైనా అనుమానాలుంటే తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను చూసుకోవచ్చన్నారు. తాను ప్రస్తుతం స్థానికంగా లేనని, తన పేరిట ఎవరైనా నకిలీ పట్టాలు సృష్టిస్తే తనకు సంబంధం లేదన్నారు.

ముందస్తు పన్ను చెల్లింపు



పన్ను చెల్లిస్తున్న పీవీఆర్ గ్రూప్స్ సంస్థ డైరెక్టర్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘానికి 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తుగా పీవీఆర్ గ్రూప్స్ యాజమాన్యం మంగళవారం రూ.8,09,207ను మున్సిపల్ అధికారులకు చెల్లించింది. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా 5శాతం పన్ను మినహాయింపుతో చెల్లించినట్లు సంస్థ డైరెక్టర్లు పీవీ. శివశంకర్‌రావు, సంతోష్ ఎం.పవార్ తెలిపారు. మేనేజర్ పి.మహేశ్వర్‌రావు, బిల్ కలెక్టర్ హరి పాల్గొన్నారు.

ఉత్తమ బోధనే లక్ష్యంగా తనిఖీలు



మాట్లాడుతున్న ఎంఈఓ భువనేశ్వరి

శ్రీకాళహస్తి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధనే లక్ష్యంగా సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ భువనేశ్వరి అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాలల సామాజిక తనిఖీలపై ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ వివిధ అంశాలపై మాట్లాడారు. సామాజిక తనిఖీ కమిటీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యావంతులు సభ్యులుగా ఉంటారన్నారు. సామాజిక తనిఖీ కోసం నిర్దేశించిన యాప్ నిర్వహణపై రిసోర్స్ పర్సన్ కస్తూరయ్య శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిరకాల స్వప్నం సాకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



టాయిలెట్ క్లీనర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- 27న టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ

సత్యవేడు: సత్యవేడు ప్రజల చిరకాల స్వప్నమైన దాసుకుప్పం బైపాస్, టీటీడీ కల్యాణ మండపం ఏర్పాటు సాకారమవుతోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఈ నెల 27న టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహణపై స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపంలో మంగళవారం నియోజవర్గం స్థాయిలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, అప్పట్లో పల్లెబాట కార్యక్రమంలో ఆనాటి ఎమ్మెల్యే నారాయణస్వామి కోరిన వెంటనే దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సత్యవేడు అభివృద్ధికి డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేశారని, ఉబ్బలమడుగు అభివృద్ధికి, స్థానికుల నిరుద్యోగ సమస్య తీర్చేందుకు శ్రీసిటీ మంజూరుతో వరాల జల్లు కురిపించారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాను కోరిన వెంటనే దాసుకుప్పం బైపాస్ రోడ్డుకు రూ.26కోట్లు, ఆరణియార్ ఆధునీకరణకు నిధులు మంజూరు చేశారని, అలాగే టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి రూ.3కోట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో నిధులు మంజూరు చేయించారని చెప్పారు. భూమిపూజ కార్యక్రమంలో మంత్రి కే.నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి, టీటీడీ చైర్మన్, కలెక్టర్ తదితరులు పాల్గొంటారని, వారపు సంత నిర్వహించే ప్రభుత్వ స్థలంలో 92 సెంట్ల స్థలంలో కల్యాణ మండపం, ఆలయం, ప్రహరీ గోడ నిర్మిస్తారన్నారు. తొలుత సురుటుపల్లి ఆలయ చైర్మన్, ఏవీఎం బాలాజీ రెడ్డి, సర్పంచ్ రవి రెడ్డి గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు.

సీఎంను టీడీపీ నేతలు విమర్శిస్తే ఉపేక్షించొద్దు

మాజీ ఎమ్మెల్యే హేమలత, ఆమె కుమార్తె హెలన్ ఇదేం ఖర్మ కార్యక్రమం పేరిట గ్రామాలకు వచ్చి ముఖ్యమంత్రిపై చౌకబారు విమర్శలు చేస్తే ఉపేక్షించరాదని, టీడీపీ నేతలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. తల్లీ కూతురు నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్ సర్వేలో కోటిమంది భాగస్వామ్యం అవడాన్ని పురస్కరించుకుని పార్టీ శ్రేణులతో కలసి బేరిశెట్టి కల్యాణ మండపంలో పీపుల్ సర్వే బ్రోచర్లను ఆయన ప్రదర్శించారు. సమావేశంలో మండల కన్వీనర్లు కే. సుశీల్ కుమార్ రెడ్డి, అపరంజిరాజు, దయాకర్ రెడ్డి, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు బీరేంద్రవర్మ, మార్కెటింగ్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పార్థిబన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

టాయిలెట్ క్లీనింగ్ మెషిన్ల పంపిణీ

సత్యవేడు: మండలంలోని 11 పంచాయతీలకు హైప్రెజర్ టాయిలెట్ క్లీనింగ్ మెషిన్లు, ఇన్సులేటర్ స్మోక్ కంట్రోల్ మెషిన్లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పంపిణీ చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులకు వీటిని ఎంపీపీ వి.ప్రతిమ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. దాసుకుప్పం, అలిమేలు మంగాపురం, చెరివి, కన్నావరం, మల్లవారిపాళెం తూర్పు, మల్లవారిపాళెం పడమర, సత్యవేడు, పీవీ పురం, శిరుణంబూదూరు, రాజగోపాలపురం పంచాయతీలకు ఈ మెషిన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రమణకుమార్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళలు మహరాణులయ్యారు

- సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం



సమస్యలను ఎమ్మెల్యేకి వివరిస్తున్న గిరిజన మహిళలు

కేవీబీపురం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనలో మహిళలందరూ మహరాణులయ్యారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండలంలోని తిమ్మసముద్రంలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. మా భవిష్యత్తు నువ్వే జగనన్న స్టిక్కర్లను అంటించారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. గ్రామంలోని సుమారు 247 కుటుంబాలు రూ.9.67 కోట్ల వరకు ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాయని సంక్షేమ బుక్‌లెట్లతో వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీటీసీ బొబ్బిలి వసంత, ఉప సర్పంచ్ ప్రకాశంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ , సీనియర్ నేత నందకుమార్, సుధాకర్‌నాయుడు, మల్లికార్జున్‌రెడ్డి, ముఖ్యనేతలు లాల్‌బాబు యాదవ్, బిల్లు నరేష్‌యాదవ్, కుమార్, శాస్త్రిరాజు రమేష్, జనార్ధన్,దాముర‌రెడ్డి,ఎంపీటీసీలు మూర్తి సుబ్బన్న, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పాలకమండలి చైర్మన్ అంజూరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను మంగళవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు వేర్వేరుగా పరిశీలించారు. పాలకమండలి చైర్మన్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు.నిర్మాణంలో ఎలాంటి రాళ్లు వినియోగిస్తారు? ఎంత వరకు ఆలయ నిర్మాణం చేస్తారో? పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ఆలయ పునర్నిర్మాణ పనులకు గురువారం భూమిపూజ చేస్తామని, ఎమ్మెల్యే హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ మురళీధర్ రెడ్డి, డీఈ శ్రీనివాసులురెడ్డి, ఏఈ కిషోర్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీహరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, స్థపతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై ఆర్డీఓ సమీక్ష

- పనులు వేగవంతం చేయాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలో జగనన్న గృహ నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని శ్రీకాళహస్తి ఆర్డీఓ కెఎస్ రామారావు ఆదేశించారు. మంగళవారం తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల వారీగా గృహ నిర్మాణాలపై ఆర్డీఓ సమీక్షించారు. మండలానికి మంజూరైన 978 గృహాల్లో 362 పూర్తి చేశారని, 257 నిర్మాణ దశలో, 264 గృహాల పనులు మందకొడిగా చేస్తున్నట్లు తెలుసుకున్నారు. లబ్ధిదారులందరితో మాట్లాడాలన్నారు. పట్టా ఇచ్చాక ఆరునెలల వ్యవధిలోనే ఇంటి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందని, బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నా ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. ఇకనైనా గడువులోపు పూర్తి చేయాలన్నారు. సమీక్షలో తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ తరుణాక్షి రెడ్డి, హౌసింగ్ డీఈ శేషగిరిరావు, ఏఈ సుబ్రమణ్యం, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

లావాదేవీలు పారదర్శకంగా ఉండాలి





మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఏడీ జ్యోతి, హాజరైన ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు

- డీఆర్‌డీఏ పీడీ ఏడీ జ్యోతి

శ్రీకాళహస్తి రూరల్: మహిళా సంఘాలు బ్యాంకు రుణాలు పొందినప్పుడు తిరిగి చెల్లించడంలో కూడా పారదర్శకంగా ఉండి లావాదేవీలు పెంపొందించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఏడీ జ్యోతి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని వైఎస్సార్ క్రాంతి పథం–స్త్రీశక్తి భవనంలో మంగళవారం 11 మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు, వీఓఏలకు లోకోస్ యాప్‌పై శిక్షణా తరగతుల ప్రారంభంలో ఆమె మాట్లాడారు. మహిళా సంఘాలు ఆర్థిక లావాదేవీలు ప్రస్తుతం లోకోస్ యాప్ ద్వారా దేశం మొత్తం మీద ఒకే విధానం పాటిస్తున్నాయన్నారు. ప్రతి మండలం నుంచి శిక్షణకు హాజరైన ఇద్దరు సీసీలను, వీఓఏలు ఆయా మండలాల పరిధిలో శిక్షణ ఇచ్చి లావాదేవీలు నమోదు చేయటంలో మన జిల్లా ఆదర్శంగా నిలపాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందజేస్తున్న సబ్సిడీ పథకాలు ఎక్కువ మంది లబ్ధి పొందేలా అవగాహన కల్పించాలని కోరారు. జగనన్న హౌసింగ్ స్కీమ్ కింద ఇళ్లు నిర్మించుకుంటున్న సభ్యుల్లో అర్హులకు రుణాలు మంజూరు చేయించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయించాలని సూచించారు. సమాఖ్యల ద్వారా తీసుకునే సామాజిక పెట్టుబడి నిధితో పాటు స్త్రీనిధి ఉన్నతి, బ్యాంకు లింకేజి నూటికి నూరు శాతం రికవరీ ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఐబీడీపీఎం మాధవి, చేయూత డీపీఎం వనజాక్షి, ఏరియా కో–ఆర్డినేటర్ డాక్టర్ డాంగే యాదవ్, ఏపీఎం మునెయ్య పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

దక్కిలి: వెంబులూరు పంచాయతీలోని (పెదకోన) వెలుగొండలు కింద వెలసియున్న యోగ లక్ష్మీనరసింహస్వామి ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం, రాత్రి 7గంటలకు తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భూ సమస్యల పరిష్కారానికి సమన్వయ కృషి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి సమన్వయ కృషి చేయాలని తహసీల్దారు టీవీ సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. భూమి లేని పేదలను గుర్తించి, అర్హులైన వారికి భూ పంపిణీ చేయాలన్నారు. పరిష్కారానికి నోచుకోని రెవెన్యూ సమస్యలను తన దృష్టికి తేవాలన్నారు. రైతులకు సంబంధించి సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. డీటీ శివయ్య, ఆర్ఐ వెంకట సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి మోటారుకు మరమ్మతులు



మోటారుకు మరమ్మతులు చేస్తున్న ఎలక్ట్రీషియన్

మండలంలోని ఎండీపుత్తూరు పంచాయతీ మిట్టఇండ్లు గ్రామంలో మంగళవారం తాగునీటి విద్యుత్ మోటారుకు మరమ్మతులు చేశారు. రెండు రోజులు క్రితం మోటారు చెడిపోయింది. స్పందించిన సర్పంచ్ మోహనప్రియ దానిని రిపేరు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

యాగశాల పూజలు ప్రారంభం



యాగశాల పూజలు చేస్తున్న అర్చకస్వాములు

పిచ్చాటూరు: మండలంలోని సిద్ధిరాజుకండ్రిగలో శ్రీ సోమనాథేశ్వరాలయంలో రెండవ రోజు యాగశాల పూజలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరయ్యారు. ప్రత్యేక ఆలయాల్లో కొలువుదీరిన శ్రీ పార్వతీ సమేత సోమనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీగణపతి, శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, లక్ష్మణ సమేత సీతారాముల వారిని ఆయన దర్శించుకున్నారు. అలాగే కళ్యాణ నవగ్రహాల పూజల్లో పాల్గొన్నారు. ఆలయం ప్రత్యేకతలను ధర్మకర్త జ్యోతిరాజు ఎమ్మెల్యే తెలియజేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్ రావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్లు కేటీ హరిశ్చంద్రా రెడ్డి(పిచ్చాటూరు), అపరంజిరాజు(నాగలాపురం) రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, జిల్లా కార్యదర్శి తొప్పయ్య, రామగిరి ఆలయ చైర్మన్ వెంకటేశులు, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, వేలు, సోమనాథేశ్వర ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘గురుకుల’ ప్రవేశ పరీక్షలో ప్రతిభ



ఉదయభాను

ఏర్పేడు: మహాత్మా జ్యోతీరావ్‌పూలే గురుకుల పాఠశాల 5వ తరగతి ప్రవేశ పరీక్షల్లో తమ స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటినట్లు స్థానిక శివ పబ్లిక్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ డైరెక్టర్ నల్లపాలెం ప్రసన్న మంగళవారం తెలిపారు. తమ విద్యార్థిని ఉదయగిరి ఉదయభాను జిల్లాస్థాయి 5వ ర్యాంకు సాధించిందని, అలాగే గురుసాత్విక, పూర్ణిమ, ఈశ్వర్‌ప్రసాద్, రేష్మి, మోక్షిత, మునికిశోర్, విజయ. జస్వంత్, మిథున్, సందీప్‌రెడ్డి, సుధాకుమారి, దిలీప్‌కుమార్, లహిత, యశస్విని వందలోపు ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు.

బొజ్జల ఇలాకాలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- రహదారి వేయకుండా మొక్కుబడిగా సీసీ రోడ్లు వేసి నిధులు స్వాహా చేసిన టీడీపీ నేత
- ‘గడప గడప మన ప్రభుత్వం’లో సమస్యలు నివేదించిన ప్రజలు



ఆర్వో ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి స్వగ్రామంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఊరందూరు సచివాలయ పరిధిలోని ఊరందూరు ఎస్టీకాలనీ, మద్దిలేడు గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 250 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా? అని ఆరా తీశారు. లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వారికి వివరించారు. గత టీడీపీ పాలన కంటే ప్రస్తుత ప్రభుత్వ పాలనలోనే తమకెంతో మేలు కలిగిందని గ్రామస్తులు వివరించారు.

– ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

కాలనీ ఆవిర్భావం నుంచీ ఇప్పటి వరకు రహదారి లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని ఊరందూరు ఎస్టీ కాలనీ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తమకు కాలనీకి రావాలంటే చెరువు కట్టమీదుగా చేరుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో చెరువుకట్ట మీదుగా రహదారి వేయడానికి అప్పటి ప్రభుత్వం రూ.1.5 కోట్లు మంజూరు చేసిందని, అయితే రహదారి వేయకనే ఓ టీడీపీ నాయకుడు కాలనీలో మొక్కుబడిగా సీసీరోడ్లు వేసి నిధులు స్వాహా చేశాడని చెప్పారు. ఈదుల కాలువ మీద బ్రిడ్జి నిర్మిస్తే తమ పొలాల్లో వెళ్లడానికి ఎలాంటి సమస్య ఉండదని, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

–మద్దిలేడులో ఇప్పటి వరకు సుమారు 45 కుటుంబాలకు ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేశారని, అయితే ఇంకా 40 కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించి పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. తమ చెరువు పూర్తిగా ఆక్రమణలకు గురవడంతో సాగునీటికి తీవ్ర సమస్య తలెత్తుతోందని, చెరువు సర్వే చేయించి చుట్టూ ట్రెంచ్ కొట్టాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఆక్రమణల నుంచి వంట కాలువలకు విముక్తి కల్పించాలని, గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కోరారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అనంతరం మద్దిలేడులో ఆర్వో ప్లాంట్ ప్రారంభించారు. గర్భిణులకు సీమంతం చేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, హరి, గురవయ్య, బిళ్ల శ్రీనివాసులు యాదవ్, కూనాటి చెంచయ్యయాదవ్, యదుభూషణ్, రంగయ్య, చంద్రారెడ్డి, దిలీప్, గోపి, శివ, సాయి, విజయభాస్కర్‌రెడ్డి, వెంకటేష్, సుకురుల్లా ఖాన్, రుద్రయ్య, సుబ్రమణ్యం, కాటయ్య, మణి, చంద్రయ్య, వెంకటాద్రి, వెంకటయ్య, సుబ్బయ్య, జనార్ధన్, శంకరయ్యయాదవ్, మాధవయ్య యాదవ్, రామయ్యయాదవ్ పాల్గొన్నారు.

సంతవేలూరు అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

–మాజీ ఎమ్మెల్యే హేమలతకు వైఎస్సార్ సీపీ నేతల సవాల్



విలేకరులతో మాట్లాడుతున్న నాయుడు దయాకర్ రెడ్డి తదితరులు

వరదయ్యపాళెం: సంతవేలూరు ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధమని, దీనిపై టీడీపీ నేతలు సిద్ధమా? అని సత్యవేడు టీడీపీ మాజీ ఎమ్మెల్యే హేమలతకు పార్టీ నాయకులు సవాల్ విసిరారు. టీడీపీ నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత సంతవేలూరులో ఏ అభివృద్ధి జరగలేదని సీఎంపై విమర్శలు చేయడంపై పార్టీ నాయకులు మండిపడ్డారు. దీనిని ఖండిస్తూ మంగళవారం సాయంత్రం సంతవేలూరు సచివాలయ ప్రాంగణంలో సర్పంచ్ నందయ్య అధ్యక్షతన మండల వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ చిన్నా, పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. సంతవేలూరులో రూ.4.25కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి చేసినట్లు ఆ పనులను వివరించారు. 206మందికి ఇళ్లనరు మంజూరు చేసి, బిల్లుల రూపంలో రూ.2.85కోట్లను చెల్లించినట్లు స్పష్టం చేశారు. సమావేశంలో కువ్వాకొల్లి సర్పంచ్ చంద్రయ్య, అరుదూరు సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ పరంధామరెడ్డి, బీఎస్‌కండ్రిగ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రమణ్యం రెడ్డి, మాజీ సర్పంచ్ బొప్పన తిలక్‌బాబు, నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ శివ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



ఆది శంకరాచార్యుల చిత్రపటానికి మొక్కుతున్న ఆలయ చైర్మన్, ఈఓ తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మగుడి ఆవరణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆదిశంకరాచార్యుల చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి విశేష పూజలు చేశారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, ఆలయ ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

–పాఠశాలల ఆడిట్‌పై అవగాహనలో ఎంఈఓ



ఆడిట్‌పై ప్రధానోపాధ్యాయులకు వివరిస్తున్న రిసోర్స్ పర్సన్

బుచ్చినాయుడుకండ్రిగ: మనబడి నాడు–నేడు, జగనన్న విద్యా కానుక , అమ్మ ఒడి వంటి వాటి వల్ల ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారాయని, వాటిని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాఠశాలల ఆడిట్‌కు సంబంధించిన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి పాఠశాలను ఆడిట్ చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల కమిటీల సహకారంతో బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధి, పర్యవేక్షణ, మధ్యాహ్న భోజన తనిఖీ, పాఠశాలల పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



తొట్టంబేడు : కాసారంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



పాపానాయుడుపేటలో ర్యాలీ చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం మండలంలోని కాసారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవగాహన ర్యాలీ నిర్వహించింది. దోమల వలన వచ్చే విషజ్వరాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యసిబ్బంది తెలియజేశారు. ఇళ్ల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, అనూష, ఎంపీహెచ్ఈఓ బాషా, సూపర్‌వైజర్ అమ్మణమ్మ, ఆశా కార్యకర్తలు,ఏఎన్ఎంలు,ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ఏర్పేడు, పాపానాయుడుపేటలో..

ఏర్పేడు: మండల కేంద్రంతోపాటు పాపానాయుడుపేటలో డాక్టర్లు హర్షవర్ధన్, రాఘవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. నిల్వ ఉన్న నీరు దోమలకు ఉత్పత్తికి కేంద్రాలయ్యే ఆస్కారం ఉందని, దోమల మూలాన విష జ్వరాల బారిన పడవచ్చన్నారు. దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు అభిజ్ఞ, సాయి హరిణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: ప్రపంచ మలేరియా దినోత్సవం పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్, శ్రీరాములు, వాణి పాల్గొన్నారు.